కథ

# అనుభూతులు పదిలం... పదిలం

''అమ్మా! నిన్ను చూడాలనుంది. వెంటనే బయల్దేరి రా'' జమ్‌షెడ్‌పూర్లో చదువుతున్న బాబీ వేడ్కోలు. ఎక్కడో వరంగల్లో వున్న నేను అంతదూరం ఒంటరిగా ప్రయాణం చేసి వెళ్ళటమంటే ప్రయాసే అయినా వాడి మాటల్లోని దిగులు నన్నటు అయస్కాంతంలా లాగేసింది. ప్రయాణం ఏర్పాట్లు చేసుకుంటుంటే మరొక కాల్..యూయస్ నుంచీ.

''అమ్మా! అర్జెంటుగా వెబ్‌కెమ్ ఆన్ చేసుకుని కూర్చో. నిన్ను చూడాలనుంది'' సముద్రాల అవతల్నుంచీ ఉష. చేస్తున్న పనులాపి వెళ్ళి కంప్యూటర్ ముందు కూర్చున్నాను.

''నిన్నటి నుంచీ ప్రయత్నిస్తున్నాను నీతో మాట్లాడాలని. ఇప్పటికి తీరింది'' ఉష కళ్ళనిండా సంతోషం. అంతలోనే దిగులు.

''ఎంత డబ్బు సంపాదించుకున్నా మన వూళ్ళో మనింట్లో వున్నట్టు వుండదు. తిరిగి యిండియా వెళ్ళిపోదామని నేనంటే..మళ్ళీ మళ్ళీ వస్తామా అని పీయూష్ అంటాడు. అమ్మా! నిన్ను చూస్తే యింత సంతోషంగా అనిపిస్తుందా, కానీ నేను చూసింది నీ బొమ్మని...నిజంగా నిన్ను కాదని కాసేపటికే అర్థమై నీ స్పర్శకోసం తపించిపోతాను''

''పెద్దదానివయ్యావు కదమ్మా?''

''నీకంటే చిన్నదాన్నేగా?''

''పిల్లల తల్లివి''


''ఐనా నీ కూతుర్ని''

''ఎలా ఉషా? ఇంటిమీద బెంగ తగ్గించుకోవాలి. నీకేం తక్కువ చెప్పు? చక్కటి చదువు, వుద్యోగం, మంచి భర్త, చురుకైన పిల్లలు...అందరూ అమెరికా వెళ్ళాలని కలగంటారు. నువ్వేంటిలా? అతనొకలా. నువ్వందుకు వ్యతిరేకంగా ఆలోచిస్తే ఎలా చెప్పు? మీ యిద్దరిదీ ఒకటే మాట కావాలి. మీ యిద్దర్లో హార్మోనీ లేకపోతే పిల్లల ఆలోచనావ్యవస్థ దెబ్బతింటుంది'' నచ్చజెప్పాను.

''మగవారి డాలర్‌డ్రీమ్స్ వెనక కూడా ఆడవాళ్ళ త్యాగమేనా? మనం అనుబంధాలన్నీ తెంచుకోవల్సిందేనా?'' ఆపైన ప్రశ్నలు.

''అలా ఎందుకాలోచిస్తున్నావు ఉషా?''

''నీది ఆరుద్ర పురుగు రంగు వెంకటగిరి చీర నేను తెచ్చుకున్నాను చూడు, ఎందుకే నేను కట్టే చీర? అన్నావు గుర్తుందా? ఆ చీరని నీ స్పర్శ యింకా అంటే వుందమ్మా! నిన్ను చూడా అని మరీ మరీ అనిపించినప్పుడు దాన్ని గుండెలకి హత్తుకుంటాను. దిండుమీద పరుచుకుని పడుకుంటాను. అమ్మా..దిండు మీద ఈ చీర..అంటారు నా పిల్లలు ఆశ్చర్యంగా. మా అమ్మది. అని జవాబిస్తాను గుసగుసగా. పీయూష్ వినకూడదుగా? తనకిలాంటివి నచ్చవు. సెంటిమెంట్ ట్రాష్ అనేస్తాడు సింపుల్గా''



''నీకక్కడ బాగానే వుంది కదూ?''

''బాగా లేక? అప్పుడప్పుడు బెంగగా ఉంటుంది. సర్లేగానీ తమ్ముడెలా వున్నాడు? ఎలా చదువుతున్నాడు? వాడినొకసారి మాట్లాడమను''

''వాడికీ బెంగే, యిల్లొదిలి అంతదూరాన్న చదవటం'' అన్నాను.

''కానీ తప్పదు కదూ? అన్నీ మనకి నచ్చనివే చేస్తూ మన మంచికోసమే, ఎప్పుడో మనం సుఖంగా వుండటం కోసమే అని నచ్చజెప్పుకుంటూ, ఆ 'ఎప్పుడో' వచ్చాక అప్పుడంత కష్టపడ్డాను కాబట్టే యిప్పుడింత సుఖంగా వున్నానని సుఖానికి నిర్వచనం యిస్తూ బతికెయ్యటం''


కొన్ని సంవత్సరాల క్రితం దాకా నేను పాతిక ముప్పై సంవత్సరాల సుదూర భవిష్యత్తుని

యస్. శ్రీదేవి

వూహించేదాన్ని. దాని చిత్రం యిలా వుండేది కాదు. ఒక చక్కటి యిల్లు, అందులో నేను, అతుల్..ఉష, బాబీల కుటుంబాలు..'నేను' అనే మానవవిత్తనం శాఖోపశాఖలుగా పెరగటాన్ని వూహించుకునేదాన్ని. వాస్తవంలో జరుగుతున్నది వేరు. విత్తనాలు ఎక్కడో విసిరేయబడ్డట్టు మొలకెత్తడం. ఎవరికి ఎవరు ఎవరో..ఎక్కడెక్కడో!

## రసగుల్లా బాధ

బిపాషాబసు నెచ్చెలికాడు జాన్ అబ్రహాంకి ఇప్పుడు మంచి ఇమేజ్ ఉన్నట్టుంది. ఎప్పుడూ అభిమానులకి ఈమెయిల్స్ పంపడం, ఛాటింగ్ చేయడం అతని హాబీగా మారిపోయింది. మొన్నామధ్య ఓ అమ్మాయితో ఛాటింగ్ చేస్తుంటే బిపాషాబసు వచ్చిందిట. అయినా ఆమెతో మాట్లాడుతూనే ఆ అభిమానితో కబుర్లు పంచుకున్నాడట. 'అభిమానులు చాలా సెన్సిటివ్‌గా ఉంటారు. వారి హార్ట్ చేయడం భావ్యం కాదు' అంటున్నాడు జాన్. ఇతనిలా అంటే బిపాషా మాత్రం గంటల తరబడి ఇలా మహిళాభిమానులతో మాట్లాడుతుంటే తన గతేం కాను అని వాపోతోంది.



ఉషతో మాట్లాడ్డం పూర్తయ్యేసరికి అతుల్ ట్రెయిన్ రిజర్వేషన్‌తో వచ్చాడు! బాబీ తనకి కూడా ఫోన్ చేసాడట. వెళ్ళటానికి తనకి లీవ్ దొరకదట. ఎప్పుడూ వున్నదే. నాకోసం రిజర్వేషన్ చేయించుకొచ్చాడు.

ఉష గురించి చెప్పాను. ''అదెందుకో బాగా దిగులుపడుతోంది'' అన్నాను నేను కూడా దిగులుగానే. అతుల్ బాధపడ్డాడు. ''దగ్గిరైనా దూరమైనా యిండియాలోనైతే వెళ్ళి చూసేవాళ్ళం. అక్కడికి మనం వెళ్ళాలన్నా అది రావాలన్నా బోల్డన్ని ఫార్మాలిటీస్. నేను కూడా దానితో మాట్లాడతాలే లీజర్‌గా'' అన్నాడు.

★ ★ ★

వరంగల్లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. కంప్యూటర్ ముందు కూర్చుంటే కాలం గంటలు, నిముషాలు, క్షణాలుగా విభజించబడిన అంకెలగారడిగా మారిపోతుంది. ఆఫీసు టేబుల్ ముందు అదే కాలం కేలండరు పేజీల్లోకి లుప్తమౌతుందని అతుల్ చెప్తాడు. ఇప్పుడీ రైల్లో కూర్చుని, కిటికీలోంచీ వేగంగా పరిగెడుతున్న కొండల్నీ, చెట్లనీ, పెద్దాచిన్నా స్టేషన్లనీ చూస్తుంటే దూరం అనేది కాలంగా మారటం అర్థమౌతోంది. మొత్తం మీద ఇరవై తొమ్మిది గంటల ప్రయాణం.

పిల్లలు చిన్నవాళ్ళుగా వుండి ఇంటిపనితో సతమతమౌతూ వున్నప్పుడు ఒక్కక్షణం తీరిక దొరికితే చాలు, ఎన్నో చెయ్యాలనుకునేదాన్ని. ఎన్నో పుస్తకాలు చదవాలని వూహించుకునేదాన్ని. పిల్లలు పెద్దవాళ్ళై కావాల్సినంత తీరిక దొరికాక చదివే అలవాటు తప్పిపోయింది. బేగ్‌లో నవల్సున్నా అవి హస్తాలంకారానికే. ఇప్పుడూ అంతే. ఏమీ చేయాలనిపించక కిటికీలోంచీ బైటికి చూస్తూ కూర్చున్నాను. ఎదురుగా ఒక సిక్కు, పక్కని తెలుగతను. మేం ముగ్గురమే వున్నాము. వాళ్ళు మధ్య మధ్యలో నన్ను చూసీ చూడనట్టు చూస్తూ ఏవో మాట్లాడుకుంటున్నారు. నాకు పరిచయం చేసుకోవాలనిపించలేదు. అలాగే కిటికీలోంచీ చూస్తూ కూర్చున్నాను. ఖమ్మం స్టేషనొచ్చింది. ఎవరో ముసలమ్మ. అడుక్కోవడానికొచ్చింది.

సిక్కు ఆమెని చూసి కదిలిపోయాడు. ''నీకు కొడుకుల్లేరా?'' అడిగాడు వెంటనే.

''ఉన్నారు. ఇద్దరు'' జవాబిచ్చింది.

''ఇద్దరు కొడుకులుండి నిన్నిలా వదిలిపెట్టడమేంటి?'' సిక్కతని ప్రశ్న.

రెండు అరటిపళ్ళు తీసిచ్చాడు. రైలు కూత కూసి, కదిలింది. అతనింకా బాధపడుతూనే వున్నాడు. ''మా రాష్ట్రంలో తల్లిని యిలా వదిలిపెట్టం. అమ్మకదా!'' అంటున్నాడు. తెలుగతను యిక్కడి పరిస్థితులను వివరిస్తున్నాడు. ఎదిగీఎదగని పిల్లలు వుద్యమాల్లోకి వెళ్ళటాన్ని గురించీ, రైతుల ఆత్మహత్యల గురించీ, పాలమూరు కూలీల వలసల గురించీ ఎన్నో చెప్తున్నాడు.

''అమ్మని మన నుంచీ వేరుగా ఎలా చూడగలుగుతున్నారు? మన యింట్లోనూ మన సంస్కృతిలోనూ భాగం కదా?''

తెలుగతను నవ్వి వూరుకున్నాడు. వాళ్ళ సంభాషణ ఆగిపోయింది. తెలుగతను నాతో పరిచయం చేసుకున్నాడు.

''ఎక్కడి దాకా వెళ్తున్నారు?'' అడిగాడు. చెప్పాను.

''అక్కడెవరున్నారు?'' దానికీ చెప్పాను.

''అంతదూరం మీ అబ్బాయిని పంపించాలంటే బాధనిపించలేదా?'' అడిగాడు.

నేను చిన్నగా నవ్వి ''మా బాధలూ, వుద్వేగాలూ మీ జీవితాలనీ కెరీర్‌నీ ప్రభావం చెయ్యకూడదు కదా?'' అన్నాను.

''అందరు పేరెంట్సూ అలా ఆలోచించరు. మా పేరెంట్సు నన్ను దూరం పంపించి చదివించడం

యిష్టంలేక లోకల్లోనే వుంచి చదివించారు. మాది శ్రీకాకుళం. అక్కడే చదివాను. కానీ ఈరోజుల్లో ఏం చదివావు అనేదానికన్నా ఎక్కడ, ఏ యినిస్టిట్యూట్‌లో చదివారనేది ముఖ్యం. డిగ్రీ పూర్తై రెండేళ్లైంది. కంప్యూటర్ కోర్సులు కూడా చేసాను. జాబ్ లేదు. ఎప్పుడొస్తుందో తెలీదు. ఇంట్లో గొడవ ఇంత ఖర్చుపెట్టి చదివించాం, ఇంకా జాబ్ రాలేదని'' అన్నాడు. అతని కళ్ళలో నైరాశ్యం నీడలా పరుచుకుంది. అతనికి ఓదార్పు అక్కర్లేదు. తను చెప్పినదాంట్లోని వాస్తవాన్ని గుర్తిస్తే చాలన్న తపన వుంది. గుర్తించినట్టు తలూపాను. తర్వాత మా సంభాషణ ఆగిపోయింది. రాత్రికి యింటి నుంచీ తెచ్చుకున్న చపాతీలు తిన్నాను.

వైజాగ్‌లో సముద్రపు గవ్వల్తో చేసిన రకరకాల బొమ్మల్తో ఎక్కాడొక వ్యక్తి. అద్భుతమైన సృష్టి. ఫ్లవర్ వేజ్‌లు, పూలగుత్తులు అన్నీ గవ్వల్తోటే. షోకేసులో పెడ్తే వందలూ వేలూ పలికే బొమ్మల్ని పాతిక్కీ యాభైకీ యిస్తున్నాడు. రెండు బొమ్మలు కొని జాగ్రత్తగా చీరల మడతల మధ్య కదలకుండా పెట్టాను. ట్రెయిన్ దిగగానే ఒకటి యింటికీ ఒకటి ఉషకీ పార్సెల్ చెయ్యాలని మననం చేసుకుంటూ నిద్రపోయాను.

పలాసా దగ్గరపడ్తుంటే ఎవరో తట్టిలేపినట్టు మెలకువ వచ్చింది. బెర్త్‌మీంచి దిగాను. స్టేషన్ వచ్చేసింది. ప్లాట్‌ఫామ్, లైట్లు హడావిడిగా తిరుగుతున్న జనం. ఒక్కసారి దిగాలనిపించింది. రైల్లోంచి దిగి, ప్లాట్‌ఫామ్‌మీద నిల్చున్నాను. మనసంతా వుద్వేగం.

నా జీవన ప్రస్థానం ఈ వూరికి దగ్గర్లోని ఒక పల్లెటూర్లో మొదలైంది. ఎక్కడికెళ్ళాలన్నా యిదే రైల్వేస్టేషను. కొన్ని పదుల సార్లు ఈ ప్లాట్‌ఫామ్ మీద నడిచి, ఆ బెంచీలమీద కూర్చుని, రైలు కోసం ఎదురు చూసి, నా వుచ్ఛ్వాసనిశ్వాసాలతో యిక్కడి గాలిలో విలీనమై వుంటాను. మళ్ళీ యిక్కడికి రావాలని ఎన్నిసార్లనుకున్నా రాలేకపోయాను.

ఆస్థులున్నవారికి అనుబంధాలుంటాయి. నా యిల్లు, నా వూరు, నా వాళ్ళూ అనే మమకారాలుంటాయి.

''స్వంతిల్లున్నవాడికి ఒకటే యిల్లు. అది లేనివాడికి అన్నీ యిళ్ళే'' అనేవాడు నాన్న. సంపాదిస్తూ, ఖర్చుపెడ్తూ విలాసంగా గడిపేసాడాయన. ఒక్క అన్నయ్య నాకు. వాడు జీవితంలో నిలదొక్కుకోవడానికి చాలా స్ట్రగుల్ చేసాడు. ఇప్పటికీ చేస్తున్నాడు. ప్రైవేటు ఉద్యోగం. చాలీచాలని జీతం.

అమ్మానాన్నా చాలాకాలం వోల్డేజి హోమ్‌లో వున్నారు. వాళ్ళని తీసుకెళ్ళి తన దగ్గరుంచుకోలేదు అన్నయ్య. తమమధ్య బాంధవ్యాలు ఎందుకిలాంటి టర్న్ తీసుకున్నాయనే విశ్లేషణ మొదలైంది వాళ్ళలో. స్వంతిల్లు ఏర్పరుచుకోకపోవటంలో, వున్న యిద్దరు పిల్లల జీవితాలనీ అందంగా మలచకపోవటంలో తమ వైఫల్యంకన్నా ఎక్కువగా బాధ్యతారాహిత్యం కనిపించింది. సమాజానికనుగుణంగా తాము ప్రవర్తించలేదు. పిల్లలూ ప్రవర్తించలేదనే నిర్ణయానికొచ్చాక, వాళ్ళకింక తమ జీవితం సౌందర్య రహితంగానూ అర్థవిహీనంగానూ కనిపించింది. దిగులుతో ఒకరితర్వాత ఒకరు చనిపోయారు.

రైలు కూత కూసింది. చప్పుని ఎక్కేసాను. డోర్ వేసేసి నా బెర్త్ దగ్గిరకెళ్ళాను. సిక్కు నేను దిగటం చూసినట్టున్నాడు.

''ఎందుకు దిగారు?'' స్వచ్ఛమైన యింగ్లీషులో అడిగాడు.

నా భావోద్వేగాన్ని వ్యక్తపరచాలనిపించింది. ''నా చిన్నప్పటి వూరు. నేను తిరిగిన వూరు'' చెప్పాను.

''అమ్మ కూడా అలాంటిదే కదూ? కన్న తల్లీ, స్వంతవూరు''

నేను అవాక్కయ్యాను. నా తండ్రి బాధ్యతారాహిత్యం, వోఖాపురి ఎక్స్‌ప్రెస్‌లో క్రిక్కిరిసిపోయి ఒరిస్సా నుంచీ గుజరాత్‌కి వలస వెళ్ళే కూలీలు. ఎన్నో కట్నం చావుల వెనక దన్ను నిలబడే మగవాడి అమ్మలు. వీళ్ళంతా కూడా యీ సంస్కృతిలో

## తరగని సౌరభం

**ఒకప్పుడు తెలుగు తెరపై మంచి పాత్రలు పోషించి అందర్నీ మెప్పించిన ఈ భామ ఇప్పుడు తల్లిపాత్రల్లో దర్శనం ఇస్తోంది. కొత్త చిత్రం ఛత్రపతిలో ప్రభాస్‌కి తల్లిగా నటించిన భానుప్రియ ఇప్పుడు ఇలాంటి పాత్రల్లో నటించి రాణించగలనని అంటోంది. 'వయసులో ఉన్నప్పుడు హీరోయిన్ పాత్రలు వేస్తే ఇప్పుడు ఇలాంటి తల్లి, వదినలాంటి పాత్రలు ఇమేజ్‌కి కొత్తరూపాన్నిస్తాయి' అంటోంది భానుప్రియ.**



భాగమే. కానీ ఏవీ కూడా అతన్తో చర్చించలేదు. అతనే నా మనసు చదివినట్టు అన్నాడు, ''ఏ సమస్యైనా వ్యక్తిగతం. అమ్మ అనేది మన సంస్కృతీ నాగరీకతలకి సంకేతం. ఆమె పెంచితేనేగా మనం యిలాగో, మరొకలాగో, అసలెలాగో ఒకలా తయారయేది? ఆమె వంటరిగా మిగిలేప్పటికే ఎంతోకొంత నాన్న పురుషాధిక్యతకీ? మన బాల్యానికీ ఖర్చైపోయి వుంటుంది. మిగిలిన కొద్ది భాగం కోరేది మన దయ, కరుణ. అవి కూడా లేనివాళ్ళమైతే ఎలా?''

తెలుగు యువకుడిలా నేనూ నిస్సహాయంగా నవ్వి వూరుకున్నాను.

బెర్త్‌మీదికి చేరాను. మళ్ళీ ఏవో జ్ఞాపకాలు.

నాకప్పుడు పంథొమ్మిదేళ్ళు. బియ్యేస్సీ పూర్తైంది. ఉద్యోగంలో చేరాలనుకుంటున్నాను. నా పెళ్ళి ప్రస్తావన యింట్లో యింకా రాలేదు. అన్నయ్య అప్పటికే బియ్యే చదివి ఏదో చిన్న వుద్యోగం చేస్తున్నాడు. ప్రైవేట్‌గా పీజీ కూడా చేసాడు.

''అమ్మావాళ్ళూ నీ పెళ్ళి చేస్తారనే ఆశ నీకుందేమోగానీ అలాంటి నమ్మకం నాకేమీ లేదు. నా ఫ్రెండు అతుల్. బెంగాలీ. తల్లీ తండ్రీ చిన్నప్పుడే చనిపోతే తాతగారి దగ్గర పెరిగాడు. నువ్వంటే యిష్టం. మన కుటుంబ పరిస్థితులు తెలుసు. నిన్ను పెళ్ళి

చేసుకుంటానన్నాడు. చదువు, మంచి వుద్యోగం. ఇంతకన్నా మంచి మేచ్ నీకు రాదు'' అన్నాడు.

నేను తెల్లబోయాను. అతుల్‌ని అన్నయ్యతో రెండుమూడుసార్లు చూసాను.

''అమ్మా, నాన్నా?'' అన్నాను.

''వాళ్ళుకలాంటి పట్టింపులుంటాయని నేనను కోను. ఉన్నా బాధ్యత తప్పుతుందని వప్పుకుంటారు''

''అన్యాయంగా మాట్లాడుతున్నావు''

''నాన్నగారి బాధ్యతారాహిత్యం వల్ల మనం ఎంత అన్యాయమౌతున్నామో యింకొన్నాళ్ళు పోయాక నీకే తెలుస్తుంది''

''నీకు తెలిసిందా?''

''తెలిసింది. నాకూ అతుల్‌కీ గల తేడా చూడు. తల్లీతండ్రీ లేకపోయినా వాడి తాతగారు అన్నీ అమర్చారు. ఏం చెయ్యచ్చో, ఎలా వుండాలో అన్నీ దగ్గరుండి గైడ్ చేసారు. ఆ తర్వాత వాడికి నచ్చిన అమ్మాయిని చేసుకునే స్వేచ్ఛనిచ్చారు. డాలూ యివన్నీ తగ్గించి నాన్నగారు నామీదా నీమీదా కొంత శ్రద్ధ కనబరిస్తే బావుంటుందనిపిస్తుంది''

నిజమే! నాన్నగారు యిల్లు పట్టించుకోరు. అమ్మకి పూజలూ, వంటా, పనీ, డబ్బు అంతంత మాత్రమే!


''నేనిప్పుడేం చెయ్యను?''

''అతుల్‌ని పెళ్ళి చేసుకో. నేను దగ్గరుండి జరిపిస్తాను''

''భయంగా వుంది''

''ఐతే జీవితాంతం అమ్మానాన్నలకి సేవ చేసుకుని తరించు పెళ్ళి మానేసి''

ఆ తర్వాత అతుల్ నాతో మాట్లాడాడు. మూడు యింగ్లీషు పదాల్లో కాకుండా హావభావాల్లో తన ప్రేమని వ్యక్తపరిచాడు. తనకి నేనంటే చాలా యిష్టమట. నాకూ అలాంటి యిష్టం వుంటే పెళ్ళి చేసుకుందామన్నాడు.



నేను? పర్సనల్ రూమ్ కూడా లేని యింట్లో మామూలు గవర్నమెంటు కాలేజీలో చదువుకున్నాను. ఇంటినిండా ఎప్పుడూ బంధువులు, ఫ్రెండ్సు. కాంపిటీటివ్ ఎగ్జామ్స్ ఎలా రాయగలనో ఆలోచించు. వీధి దీపాల ముందు కూర్చుని చదువుకున్న వాళ్ళు లేరా అని వాదించకు. మొండిగా చెప్పాలంటే అది వాళ్ళ కర్మ. సున్నితంగా చెప్పాలంటే నేనంత తెలివైనవాడిని కాను. అన్నీ అనుకూలంగా వుంటేనే ప్రతిభని చూపించగలను. అదీ సామాన్యమైన ప్రతిభని. ఈ పెళ్ళిళ్ళూ, పార్టీలూ, వూళ్ళేళ్ళడాలూ, ఎవరెవరో మనింటికి రావ వయసులో వున్న అమ్మాయితో అన్ని అర్హతలూ గల యువకుడు అలా అంటే కాదనగల శక్తి ఎవరికీ వుండదేమో!

అన్నయ్య అమ్మానాన్నలతో మాట్లాడాడు ''ఇప్పుడు దాని పెళ్ళికి తొందరేంటి? బియ్యేస్సీ చదివింది. ఏదో వుద్యోగం చూసుకుంటుంది. అప్పుడాలోచిద్దాం'' అన్నారు నాన్న ఏమాత్రం వుత్సాహం చూపించకుండా.

''అప్పుడేనా మీరో పాతికవేలో యాభైవేలో ఖర్చుపెట్టగలరా?'' సూటిగా అడిగాడు అన్నయ్య. ఆ ప్రశ్నకి నాన్న దగ్గర జవాబు లేదు. ''తన ఫ్రెండ్సందరికీ పెళ్ళిళ్లైపోయాయి. ఇదొక్కర్తే మిగిలివుంది. తోటివాళ్ళంతా భర్తలవెంట పిల్లల్నెత్తుకుని తిరుగుతుంటే యిది వుద్యోగం చెయ్యాలా? ఏం వుద్యోగం? డిగ్రీకి ఏం వుద్యోగం వస్తుంది? ఐనా నాలుగేళ్ళనుంచీ ప్రయత్నిస్తుంటే నాకే రాని వుద్యోగం దీనికొస్తుందా? ఏ ప్రైవేటు కంపెనీలోనో చెయ్యాలి. అదంత అవసరమా? ఎందుకు నాన్నా, మీరు లోకం పోకడ ననుసరించి వెళ్ళరు?'' తనే మళ్ళీ అడిగాడు. నాన్న లేచి వెళ్ళిపోయారు.

అన్నయ్యే నిర్ణయం తీసుకుని పెళ్ళి తేదీ ప్రకటించాడు. ''నువ్వింకా చదివి లేదా వుద్యోగం సంపాదించుకుని ఏదో సాధించాలనేది నాన్న ఆకాంక్ష కావచ్చు. అవన్నీ పెళ్ళయ్యాక కూడా చెయ్యచ్చు. అతుల్ మాత్రం ఈ క్షణాన మాత్రమే నువ్వందుకోగలిగే అవకాశం'' అన్నాడు.

సివిల్ మేరేజికి అప్లై చేసాము నేనూ, అతుల్. అమ్మ, నాన్న నాతో మాట్లాడటం మానేసారు. అంతకన్నా వాళ్ళు నువ్విలా చెయ్యటం మాకిష్టం లేదు నీ పద్ధతి మార్చుకో అని కోప్పడి వుంటే మా మధ్యనున్న బాంధవ్యాలకి విలువ వుండేదేమో! కానీ నాన్న స్వప్నాల్లో బ్రతికే వ్యక్తి.

పెళ్ళిరోజు నన్ను కేజువల్‌గా బైటికి తీసుకెళ్తున్నట్టు రిజిస్ట్రారాఫీసుకి తీసుకెళ్ళాడు అన్నయ్య. దండలు మార్చుకుని సంతకాలు పెట్టడంతో పెళ్ళైంది. అన్నయ్య, అతుల్ తాతగారు సాక్షి సంతకాలు చేసారు. మన మంగళసూత్రాలకి వాళ్ళ సాంప్రదాయంలో సమానమయే దంతపుగాజులు అతుల్ నాకిచ్చాడు. ఇంటికి తీసుకురావద్దని నాన్న చెప్పారట. పెళ్ళవగానే ఫ్రెండ్స్‌కి చిన్న ట్రీట్ యిచ్చి, అట్నుంచీ అటే రైలెక్కాము. అదే పలాసా స్టేషన్తో నా ఆఖరి అనుబంధం. రైలెక్కిస్తూ అన్నయ్య నా చేతుల్ని పట్టుకుని ఏడ్చేసాడు.

## బోనస్...బోనస్

**తమకు వచ్చే జీతానికి తోడు అదనంగా వచ్చే బోనస్ ఎంతో ఆనందాన్నిస్తుంది ఎవరికైనా. అలాగే తారలు తమకొచ్చే రెమ్యూనరేషన్‌తో పాటూ స్టేజ్‌షోలకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అందాల తార అమృతా అరోరా కూడా ఇప్పుడు ఇలాంటివాటి పట్ల మక్కువ చూపిస్తోంది. 'ఎప్పుడూ సినిమాలేనా? కాస్త రిలీఫ్‌గా ఉండదానికి ఇలాంటి స్టేజ్‌షోలు దోహదం చేస్తాయి' అంటోంది. ఈ స్టేజ్‌షోలకి తగ్గట్టుగా వీరి అభినయం కూడా ఉండాలి కదా!**

అతుల్ అన్నయ్య భుజం తట్టి ఓదార్చాడు.

★ ★ ★

ఆలోచనల్లో ఎప్పుడు నిద్రలోకి జారుకున్నానో గానీ భువనేశ్వర్‌లో ప్లాట్‌ఫారమ్ మీద హడావుడికి మెలకువ వచ్చింది. తెలుగు యువకుడు ఎప్పుడో దిగిపోయాడు. సిక్కు బ్యాగ్ సర్దుకుని దిగటానికి రెడీగా వున్నాడు. నన్ను చూసి గౌరవంగా విష్ చేసి, దిగిపోయాడు. షాల్ మడతపెట్టి హేండ్‌బ్యాగ్‌లో పెట్టుకుని, సూట్‌కేసు తోసుకుంటూ దిగాను. పెద్ద వర్షం పడుతోంది. రిటైరింగ్ రూమ్ తీసుకున్నాను. కొద్దిసేపు రిలాక్సై స్నానం చేసి, కేంటిన్లో టిఫెన్ తిని, వైజాగ్‌లో కొన్న బొమ్మలు బ్యాగ్‌లో పెట్టుకుని స్టేషన్ బైటికొచ్చాను. వర్షం పూర్తిగా తగ్గింది. చెట్ల ఆకుల మీద నిలిచిన నీటి బిందువులమీద సూర్యకిరణాలు పడి పరావర్తనం చెందుతున్నాయి.

దార్లో ఒక పెద్దచెట్టు. దానికి ఒకే ఒక్క లేత నీలి రంగు పువ్వు. వంటరితనంతో దిగులుగా వున్నట్ట నిపించింది. కోసి బ్యాగ్‌లో వేసుకున్నాను. మళ్ళీ నాకే అనిపించింది. నా బ్యాగ్‌లో వున్న అసంఖ్యాకమైన ప్రాధాన్యత లేని వస్తువుల మధ్య దాన్నలా వేస్తే యింకా బాధపడుతుందని... వక్కపొడి వేసుకునే యియర్‌స్టెడ్ బాక్స్ ఖాళీ చేసి అందులో దాన్ని పెట్టి కొంత ప్రాధాన్యత కల్పించాను. ముదురు నీలి రంగు వెల్వెట్ మీద లేత నీలిరంగుతో అది సోయగాలు పోయింది. మనిషిని పట్టి వుంచే ఫ్రేమ్. కుటుంబం అనేది అందంగా వుంటే అందులోని ఆ మనిషికీ అందం వస్తుంది. అదే సోషల్ యీస్థటిక్స్..సామాజిక సౌందర్యం.

చాలాదూరం నడిచాక కొరియర్ ఆఫీసు కనిపించింది. విదేశాలకి కూడా వాళ్ళు పంపుతారట. అక్కడే బొమ్మల్ని నీట్‌గా పేక్ చేయించి పంపేసాను. బొమ్మ అందగానే ఉష ఎంతో సంతోషపడుతుంది. కానీ పీయూష్?

తిరిగి స్టేషనుకొచ్చాను. రాత్రి పదిన్నరకి రైలు. సుదీర్ఘ విరామం. మనిషిని బాధపెట్టే విషయాల్లో నిర్వ్యాపారత్వం ఒకటి. ఒరిస్సా టూరిజం బస్సు కోణార్క్, పూరీ వెళ్తోందని తెలిసింది. టికెట్ కొనుక్కుని బస్‌లో కూర్చున్నాను. మళ్ళీ వర్షం. బస్సు నిండా జనం. జంటలుగా గుంపులుగా నేనొక్కదాన్నే వాళ్ళమధ్య వంటరిగా వాక్‌మేన్ చెవులకి తగిలించుకున్నాను.

బస్సు కదిలింది. అరవై కిలోమీటర్ల ప్రయాణం. రెండు గంటలు పట్టింది కోణార్క్ చేరేసరికి. అతుల్‌తో అప్పుడెప్పుడో అల్లరల్లరిగా తిరిగిన ప్రదేశాలు. ఆకాశాన్నంటే గుడి..వెనుక సముద్రపుహోరు. ఆ శిధిలాలయాన్ని చూస్తుంటే, గుండెల్నిండా చెమ్మలా పాకుతున్న బాధ. వెళ్ళి సముద్రపువడ్డుని నిలబడ్డాను. కాసేపటికి మళ్ళీ ప్రయాణం. ఈసారి పూరీకి. అవే చెట్లు. అవే ఆకులు, అదే వంటరితనపు బాధ. పూరీలో కూడా సముద్రాన్ని చూసాను. మహానది కలుస్తుండటం చేత నీళ్ళు నల్లగా వున్నాయి.

తిరిగి రిటైరింగ్ రూమ్ చేరేసరికి ఆరున్నర. ఒక్కదాన్నీ గదిలో వుండలేక సామాన్లు తీసుకుని జనరల్ వెయిటింగ్ రూమ్‌లోకి వచ్చి కూర్చున్నాను. ఫైనార్ట్స్ పిల్లలు కూర్చున్న వాళ్ళని కూర్చున్నట్టు బొమ్మలు గీస్తున్నారు. వాళ్ళ కాగితాలమీద స్కెచ్చిగా కాసేపు మారిపోయాను.

రాత్రి పదీ నలభైయ్యిదుకి పురుషోత్తం ఎక్స్‌ప్రెస్‌లో టాటానగర్‌కి ప్రయాణం. చేరేసరికి పుదయం ఆరుంబావు. బాబీ స్టేషనుకొచ్చాడు నన్ను రిసీవ్ చేసుకోవడానికి. తన వెంట ఏడెనిమిది మంది ఫ్రెండ్స్. నన్ను చూడగానే వాళ్ళందరి కళ్ళల్లో సంతోషపు మెరుపు. కొందరైతే నాకు తెలీనే తెలీదు. ఇంకొందరు ఫోన్లో పరిచయం. ఒక్కొక్కరూ దగ్గిరకొచ్చి ఎంతోకాలం నుంచీ పరిచయం వున్నట్టు ఆప్యాయంగా మాట్లాడుతున్నారు. ఒకరిద్దరు వాళ్ళ సంప్రదాయం ప్రకారం వంగి నా కాళ్ళని స్పృశించారు.

''దగ్గిర్లోనే హోటల్లో రూమ్ తీసుకున్నా నమ్మా! నువ్వెన్ని రోజులుంటే అన్ని రోజులూ నీతోటే స్పెండ్ చేస్తాను'' అన్నాడు బాబీ చిన్నపిల్లవాడిలా. ఇంటి దగ్గర్నుంచీ తెచ్చిన కారప్పూస, లడ్డూలు పేపర్ ప్లేట్లలో పెట్టి అందరికీ యిచ్చాను. ప్రీతిగా తిన్నారు.

మూడు రోజులున్నాను టాటానగర్లో. అదే జమ్‌షెడ్‌పూర్. టాటాలని దేశానికి అందించిన ఆ పూరు పెద్దగా డెవలపవలేదు. అంతా లేబర్ కల్చర్. ఇండస్ట్రియల్ లేబర్ బాగా ఎక్కువలాగుంది.

శని, ఆదివాలు కావటంతో బాబీ పూర్తిగా నాతోనే వుండిపోయాడు. క్షణం కూడా విడవకుండా ఒకటే కబుర్లు. తల్లిదండ్రుల పట్ల యింత ఎటాచిమెంటుతో వుండే పిల్లల్ని మనమే చదువుల పేరిట, పుద్యోగాల పేరిట దూరం చేసుకుంటున్నామనిపించింది. బాబీ ఎంత బెంగటిల్లాడో చూస్తుంటేనే అర్థమైంది. ఊరు కాని పూరు. భాష తెలియని మనుషులు.

''రెండేళ్ళు కష్టపడ్డావంటే లైఫ్‌లో సెటిలౌతావు'' నచ్చజెప్పాను.

''అప్పుడే ఎక్కడమ్మా! జీజాజీ స్టేట్స్ రమ్మంటున్నారా? ఉషక్క కూడా అంది'' అన్నాడు. హతాశురాలినయ్యాను.

సోమవారం బాబీ కాలేజీకి వెళ్ళిపోయాడు. హోటల్ రూమ్‌లో నాకు మళ్ళీ వంటరితనమే. మంగళవారం తిరుగు ప్రయాణమయాను. ఉదయాన్నే స్టీల్ ఎక్స్‌ప్రెస్‌కి ఎక్కించాడు బాబీ. రైలు కదుల్తుంటే వాడి కళ్ళలో పల్చటి కన్నీటిపొర. నా గుండెల్లో ఎక్కడో కలుక్కుమంది. కనుమరుగయేదాకా యిద్దరం చెయ్యూపుతూనే వున్నాం.

ఖరగ్‌పూర్ చేరేసరికి తొమ్మిదిన్నర. అక్కడినుంచీ నన్ను గమ్యం చేర్చడానికి

## సల్మాన్ తహతహ

**ఎప్పుడూ వివాదాల్లో నలిగే సల్మాన్‌ఖాన్ ఇప్పుడు తన వైఖరిని మార్చుకున్నట్టున్నాడు. షూటింగ్ స్పాట్‌లో అందరినీ కలుపుగోలుగా పలకరిస్తూ సెక్సీ డ్రెస్‌లు వేసుకొస్తున్నాడట. అప్పటికీ ఇప్పటికీ ఇతనిలో వచ్చిన మార్పుకి అభిమానులతో పాటూ ఆయన సన్నిహితులు కూడా ఆశ్చర్యపోతున్నారు. వ్యవహారంలోనే కాదు తన జీవనశైలిలోనూ మార్పులు తెచ్చుకున్న సల్మాన్‌ఖాన్ కొత్త ఇమేజ్ కోసం తహతహలాడుతున్నాడు.**



యిూస్ట్‌కోస్ ఎక్స్‌ప్రెస్ వుంది. అక్కడి నేలమీద అడుగుపెట్టగానే వళ్ళు ఝల్లుమంది అతుల్‌ని తాకిన మొదటిసారిలాగే. రవీంద్రుడినీ, శరత్‌నీ, యిద్దరు బోసుల్నీ అందించిన బెంగాలీ నేల. ఏకంగా ఒక ఐఐటీయే వున్నా, చాలా చిన్న వూరు ఖరగ్‌పూర్. పొడవైనదిగా ప్రపంచం ప్రసిద్ధి చెందిన ప్లాట్‌ఫామ్. దాన్నే మూడుగా విభజించారు. వెయిటింగ్‌రూమ్ పాతకాలపు కట్టడంలా వుంది. పైన మాత్రం రేకులు. ఇంతలో ఆకలిగా అనిపించింది. కేంటిన్‌కి దారితీసాయి నా కాళ్ళు. థాలీ ఆర్డరిచ్చానుగానీ ఒక్కముక్క కూడా తినలేకపోయాను. స్టేషన్లో బాబీ కంటి తడి ఒక్కసారిగా గుర్తొచ్చి నన్ను వుక్కిరిబిక్కిరి చేసింది. పదార్థాలన్నీ వదిలిపెట్టి కొద్దిగా పెరుగన్నం తిని లేవబోతుంటే నన్నే గమనిస్తూ నిలబడ్డ ముసలి వెయిటరు-

''ఏమైంది కూతురా?'' అనడిగాడు బెంగాలీని వీలైనంత హిందీగా మార్చి.

బాబుని వదిలిపెట్టి వచ్చిన విషయం మనసు కలతబారిన సంగతి చెప్పాను. అతడు తాత్వికంగా నవ్వాడు ''పిల్లలు మనమీద ఆధారపడి వున్నంతవరకే ఈ ఆరాటాలు, తాపత్రయాలు. ఉద్యోగాలొచ్చి, పెళ్ళిళ్లైపోయాక వాళ్ళెవరో మనం ఎవరో'' అన్నాడు. అతడికి ఎనిమిదిమంది పిల్లలుట. ఐదుగురు ఆడ, ముగ్గురు మగ. అందరికీ పెళ్ళిళ్ళయ్యాయని చెప్పాడు. దుర్గాపూజకి పిల్లలందర్నీ పిలిచి, బట్టలు పెట్టి వేడుగ్గా పండుగ జరుపుతాడట. జీవనసాఫల్యం కనిపించింది అతని మాటల్లో. అంతలోనే-

''పండుగవగానే ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళిపోతారు. మిగిలేది నేనూ నా భార్యే'' అన్నాడు వైరాగ్యం ధ్వనించేలా.

అతుల్ గురించీ పిల్లల గురించీ అడిగాడు. బాబీ యింతదూరం వచ్చి చదువుతున్నాడనీ, వాడిని చూడటానికి నేను రాష్ట్రాల అవతల్నుంచీ వంటరిగా వచ్చాననీ విని ఆశ్చర్యపోయాడు. ఉష అమెరికాలో వుందన్న విషయం విని యింకా ఆశ్చర్యపోయాడు. నాకూ తనకీ గల స్థాయీ భేదాన్ని అప్పుడే గుర్తించినట్టు ముడుచుకుపోయాడు గానీ-

''ఏమైంది కూతురా?'' అన్న అతని పలకరింపులోని ఆర్తి నా మనసు నిండా మలయ పవనంలా తాకుతూనే వుంది. అతనితో మాట్లాడుతూ వదిలిపెట్టినవన్నీ తిన్నాను. కడుపు నిండింది. లోపలి అలజడీ చల్లారింది. నా హృదయం అతని యింటిని వెతుక్కుంటూ వెళ్ళింది. ఎనిమిదిమంది పిల్లల కుటుంబాల మధ్య దుర్గాపూజ జరుపుకుంటున్న దృశ్యాన్ని రమ్యంగా చిత్రించుకుంది. అలాంటి కుటుంబంలో నాకు భాగంలేనందుకు సన్నటి అసంతృప్తిరేఖతో తిరిగి నన్ను చేరుకుంది. దార్లో తిందామని జమ్‌షెడ్‌పూర్లో కొన్ని రసగుల్లాలు తీసి, అతనికిచ్చాను.

''ఎందుకు కూతురా?'' మొహమాట పడ్డాడు.

''కూతురన్నావుగా?'' నవ్వాను. అతను తీసుకుని కృతజ్ఞతలు తెలిపాడు.

ఈస్ట్‌కోస్ట్‌లో ఎక్కాను. కిటికీ పక్క సీటు. ఎక్కిన దగ్గర్నుంచీ గమనించాను...వంటిమీద చిన్న ఆచ్ఛాదన మాత్రమే వున్న బెస్తవాళ్ళు రైలాగినప్పుడల్లా కేన్లూ, ప్లాస్టిక్ బిందెల్తో దిగి, ట్రాక్ పక్కనున్న కుంటల్లోంచీ నీళ్ళు ముంచుకుని ఎక్కుతున్నారు. హడావిడీ, తోపులాట, రైలెళ్ళిపోతుందేమోనన్న కంగారు. పడుతున్నారు, లేస్తున్నారు, ఎక్కుతున్నారు. వింతగా చూసాను. తర్వాత తెలిసింది, ఈ రైల్లో ఏలూరుదాకా చేపల రవాణా జరుగుతుందనీ, ఎప్పటికప్పుడూ నీళ్ళు మారుస్తూ చేపలు చనిపోకుండా చూసుకోవలసిన బాధ్యత వాళ్ళదేనని. బ్రతుకు పోరాటంలో వాళ్ళ మనసులు నిర్దాణంగా వున్నాయి. ఉన్నదల్లా ఐదారడుగుల శరీరం. దాన్ని నియంత్రించే జానెడు పొట్ట. ఆ పొట్టకోసం తిప్పలు. నిట్టూర్చాను.

భువనేశ్వర్ చేరేసరికి చీకటిపడింది. మహానదికి ఎన్ని వంతెనలో! ఒరిస్సా ప్రభుత్వ ఆదాయమంతా ఈ వంతెనలు కట్టడానికీ వాటి నిర్వహణకే సరిపోతుందేమో!

వైజాగ్ స్టేషన్లో నా సెల్ మోగింది అతుల్.

''నీకోసం ప్లాట్‌ఫామ్ మీద వున్నాను. ఎదురు చూస్తున్నాను. అసలు భువనేశ్వర్‌లోనే యింటర్‌సెప్ట్ చెయ్యాల్సింది. అంత టైం లేకపోయింది. ఈవేళ, రేపు ఆఫని వుదయమే తెలిసింది''

నా గుండె గువ్వపిట్టలా కువకువలాడింది. రైలాగీ ఆగగానే దిగేసాను. రెండు బలమైన చేతులు ఆర్తిగా నన్నల్లుకున్నాయి.

''హౌ ఆర్యూ?'' చెవుల్లో గుస గుస.

రాత్రికి హోటల్లో వుండి పొద్దున్నే బీచికి పరిగెత్తాము. ఎంత అందమైన వుదయం! రాత్రంతా అలలు విసిరిన గవ్వలేరుకోవడానికి బెస్త పిల్లలు అప్పటికే వచ్చేసి వున్నారు. వాకింగ్‌కి వచ్చినవాళ్ళు, సూర్యోదయాన్ని చూడటానికి వచ్చినవాళ్ళు, నీరవనిశ్శబ్దంలో చిరు సందడి.

అతుల్ తన జేబులోంచీ ఒక బాక్స్ తీసాడు. నాకు ప్రియాతి ప్రియమైనది. చిన్న మంచి గంధం పెట్టె. దాంట్లో ఒకే ఒక సంపెంగపువ్వు. ఎండిపోయి, ఐనా సువాసన వదలక. మా పెళ్ళిరోజున అతుల్ నా జడలో పెట్టినది.

''మన ప్రేమజ్ఞాపికని ఈ అనంతసాగరంలో కలుపుదాం. అజరామరంగా వుంటుంది మనం వున్నా లేకున్నా'' అంటూ ఆ పెట్టెని నీళ్ళలోకి వదిలాడు. తనని ఆనుకుని కైదండ పట్టుకుని నిలబడి దాని గమనాన్ని చూసాను. అరుణోదయవేళ ఎర్రటి వెలుతుర్లో అదొక అద్భుత దృశ్యం.

ఎండెక్కాక బట్టలు వంటిమీదే ఆరబెట్టుకుని, యిసుక దులుపుకుని హోటల్ రూముకెళ్ళాం. స్నానం చేసాక అతుల్ మంచి రెస్టారెంటుకి తీసుకెళ్ళాడు. వరంగల్లోలాగే యిక్కడా ఒక వంటరి టేబుల్. దానికి ఒకవైపు రెండు కుర్చీలు. మరోవైపు బిగించబడ్డ అద్దం. మేమిద్దరం ఎప్పుడు వెళ్ళినా యిలాంటి సీటే వెతుక్కుంటాడు అతుల్.

ఎందుకని అడిగాను పెళ్ళైన కొత్తల్లో.

అతని జవాబు ''టేబుల్ అటంచుని వున్న శూన్యం కనిపించదు''

నిజమే! ఉన్నది మేమిద్దరమే అయినా ఎంతో నిండుగా వుంది టేబుల్.

''బెంగాల్ దాకా వెళ్ళొచ్చానుకదా అతుల్. కొద్దిగా కవిత్వదోషం అంటుకుంది. పిసరంత వాత్సల్యాన్ని వెతుక్కుంటూ ఎక్కడెక్కడో తిరిగిన నా హృదయం ఆ తిరిగిన చోటల్లా కొంత కొంత తనని కోల్పోతూ వచ్చింది'' అన్నాను.

అతుల్ నవ్వి ''ఆ దోషం మా ప్రాంతపు రక్తంలోనే వుంది. నీ వెనకే నా హృదయం కూడా వెళ్ళి నువ్వు పోగొట్టుకున్న భాగమంతా పోగు చేసుకుని తనలో కలుపుకుంది. అందుకే దాని వైశాల్యం పెరిగిపోయింది. నిన్నందులో బంధించి వుంచుతాను యింకెక్కడికీ వెళ్ళకుండా'' అన్నాడు.

నేను నవ్వాను. మా చుట్టూ మనుషులు లేకపోయినా మనసునిండా అనుభూతులున్నాయి. అందరూ ఆప్తులు కారు. కానీ అంతరంగంలోకి వచ్చి ఒక్కొక్క అనుభూతిని మిగిల్చి వెళ్తున్నారు.

పుట్టుక సత్యం. మరణం తథ్యం. మధ్యలో వున్న జీవితం అనుభూతుల పొరలని చుట్టుకున్న కాలగతి.

రైల్లో సిక్కు. ఖరగ్‌పూర్లో ముసలి వెయిటరు..తిరిగొస్తుంటే బెస్త వాళ్ళు..నేను కప్పుకున్న కొత్తపొరలు.

☆

